# మా అత్త!

● యం. హనుమంతరావు ●

★

మా అత్త యనుటచే పిల్లనిచ్చిన అత్తయనిగాని, మేనత్తయనిగాని యనుకుందురేమో! అట్టి బాంధవ్యమేమి లేదని, యిరుగు పొరుగువారిని సంబంధపూర్వకముగా సంబోధించుట మన హిందూదేశీయుల కలవాటు కాబట్టి ఆ విధముగానైనా అత్తయే మా అత్తయని విన్నవించుచున్నాను,

మా అత్తకు పిల్లలులేకపోతే అనేకమొక్కులు మొక్కింది. అనేక యాత్రలు చేసింది. ప్రయోజనము లేకపోయింది. అందువల్ల "తమకు తాము సహాయము చేసికొనువారికి దేవుడు సహాయము చేస్తాడు" అనే సామెతను రుజువుచేసింది. నేరేడు పండువంటి మెల్లకన్ను గల సుపుత్రుణ్ణి దేవుడు ప్రసాదించాడు.

ఆచారములో మా అత్తను చెప్పే యింకెవ్వరినైనా చెప్పాలి. మడిగుడ్డల్ని ధరిస్తే మాటిమాటికి మైల పడవలసివస్తుదని. ఆ యిబ్బంది లేకుండా చేసేదిట. ఒకసారి మడిగుడ్డ ధరించింది. ఇంతలో పిల్లవాడి దగ్గెరగా పాము ఒచ్చింది. మైలపడటానికి ఇష్టము లేక 'పాము పాము' అని కేకలువేసింది. అదృష్టవశాత్తు పాము ఆమె కేకలకు భయపడి పిల్లవాని కెట్టి హాని చేయకుండానే వెళ్ళిపోయింది. అప్పటినుంచి మా వీధివారు మా అత్తకు "ఆచారపాము" యని పేరు పెట్టేరు.

బంధువులను మర్యాదచేయుటలో మా అత్త మంచి నిపుణురాలు. సామాన్యముగా బంధువులతో "మా బోటివారింట్లో యెందుకు భోజనము చేస్తారు? మేము బీదవాళ్ళమాయె" అని ముందరి కాళ్ళకు బంధాలు వేస్తుంది. ఆ మాటలను అర్థము చేసికొననివారితో, "వారమురోజులనుంచి జ్వరము వస్తున్నది. చాలా నీరసముగా నున్నది" అని యేకరువు పెడుతుంది. అందుకూ లెక్కచేయనివారితో, "ఈ కరువు తగలపడ, అయిన వారికి భోజనము పెట్టటానికికూడా వీలులేకుండా పోతున్నది" అని మెల్లగా మాటలు విడుస్తుంది.

మన హిందూదేశమునకు ప్రజాప్రభుత్వము పనికిరాదు, నియంతృత్వము తగినదని మా యత్త నమ్మకము. మా వీధిలో నున్నవారామె చెప్పినట్లు నడుచుకోవాలిసిందే, లేకపోతే ఆ వీధిని విడిచిపోవాలి. మా వీధిలో ఎవ్వరైనా భోజనానికి పిలుస్తే మా అత్తను మొట్టమొదట పిలుస్తారు. ఒకసారి ఆమెగారింట్లో నున్నవాళ్ళు పొరబాటుగా, సత్యనారాయణవ్రతము చేసికొన్నప్పుడు, ఆమెను పిలువలేదుట. అందువల్ల మా అత్తకు కోపమొచ్చి యిల్లు ఖాళీ చేయించిందిట.

మా అత్తయింటిముందర రోజూ సభ జరుగుతుంది. కూరలు మొదలుకొని భర్తను ఎదిరించటమువరకు చర్చలోకి వస్తాయి. భర్తను ఎదిరించి కట్టెతోనో, రోకలిబండతోనో కొట్టినవారు మా అత్త పొగడ్తల కర్హులౌతారు.

మా అత్తకొడుకు కొకసారి ప్రక్కింటివారి కలము దొంగిలించుకొచ్చాడు. కలముకొరకు వాళ్లు వస్తే, "మావాడికి మటుకు కలమక్కరలేదా, మీరేనా వ్రాసేది. ఇవ్వటానికి వీల్లేదు, పొండి!" యని గదమాయించి బయటికి పంపించింది.

మా రాఘవయ్యగారి శ్యామ మా అత్తకొడుకును కొట్టి యెక్కడకో పారిపోయాడు. అందువల్ల ఆయనగారి కొడుకు చేసిన నేరానికి ఆయనగారి మీదకు దాడివెడలింది.

మా అత్తభర్త రామయ్య ఊరినుండి చెప్పిన వేళకు రాక రాత్రి 8-30 గంటలకు వచ్చాడుట. అందుకుగాను శిక్షగా తలుపు తీయలేదుట అంతటతనికి వేరే గత్యంతరము లేక ఆ రాత్రికి మా యింట్లోనే పడుకొన్నాడు.